యాసంగి సాగుకు సమాయత్తం..

- వరి వైపే రైతుల మొగ్గు
- పెరగనున్న సాగు విస్తీర్ణం

వెల్గనూర్‌లో నాగలితో జంబు కొడుతున్న రైతు

నారు మడిలో వరి ధాన్యం మొలకలు చల్లుతూ..

దండేపల్లి, డిసెంబర్ 2 : యాసంగి పంటల సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఆశించిన మేరకు వర్షాలు కురవడంతో నీటి వనరులన్నీ నిండాయి. చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు నిండుకుండలా కళకళలాడుతున్నాయి. గతేడాదిలో సాగైన పంటల కంటే ఈసారి ఎక్కువగా సాగుచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బోరుబావుల వద్ద, చెరువుల పక్కన రైతులు నార్లు పోశారు. మరి కొందరు రైతులు ఆరుతడి పంటల కోసం దుక్కులు దున్నుతున్నారు. ఆరు తడి పంటల వైపు దృష్టి సారించకుండా కడెం, గూడెం నీటి విడుదల ప్రకటనపై ఆశతో వరి సాగుపై ఎక్కువ మోగ్గు చూపనున్నారు.

నిండుకుండలా చెరువులు, కుంటలు...

కడెం జలాశయంతో పాటు దాని కింద ఉన్న చెరువుల్లో నీటి మట్టం ఆశాజనకంగా ఉంది. ఏ చెరువులో కూడా నీటి మట్టం అడుగు తగ్గేట్టు లేదు. మండలంలోని ప్రతి చెరువులో కూడా నీటి మట్టం బాగానే ఉండటంతో రబీలో చెరువుల కింద పొలాలు పండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గోదావరి నీరు కూడా ఆశాజనకంగా ఉండడంతో తీర ప్రాంతాల రైతులు మోటార్ల ద్వారా సైతం రబీలో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది.

సేవా అవార్డులకు దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీరాంపూర్, డిసెంబర్ 2 : జూనియర్ చాంబర్ ఇంటర్‌నేషనల్(జేసీఐ) సేవా సంస్థ 2023 సేవా అవార్డులకు మంచిర్యాల జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ప్రతిభ, సేవా అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జేసీఐ జిల్లా అధ్యక్షుడు ఆరుముల్ల రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక సేవా రంగం, క్రీడా రంగం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ, పట్టణ అభివృద్ధి, సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, మిమిక్రీ, విద్య, వైద్యం, యోగా, ఆధ్యాత్మిక రంగ, ప్రజా ప్రతినిధులు తదితర రంగాల్లో సేవలు అందిస్తున్న వారు సేవా పురస్కార్ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9676036829, 9985512134ల ద్వారా సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తా

- పీఆర్‌టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి

మాట్లాడుతున్న తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి

జన్నారం, డిసెంబర్ 2 : ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎనలేని కృషిచేస్తానని మంచిర్యాల జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గతంలో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొంది ప్రధానోపాధ్యాయులులైన కట్ట రాజమౌళి, గోళ్ల రామన్న, మురళీధర్, అజయ్‌కుమార్, శ్రీనివాస్‌ను సన్మానించి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు మల్టీజోన్-1లో ప్రమోషన్లు ఇప్పించిన ఘనత పీఆర్టీయూ సంఘానికే దక్కుతుందన్నారు. సీపీఎస్ పింఛన్ విధానం రద్దు కోసం తమ సంఘం పాటుపడుతుందని, ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేందుకు రాష్ట్ర సంఘం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘం మండల అధ్యక్షుడు కట్ట రాజామౌళి, ప్రధాన కార్యదర్శి నగూరు సత్యనారాయణ, శ్రీనివాస్, రాజారావు, మురళీధర్, గొల్ల రామన్న, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటేశారు..

- జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న 5108 మంది ఓటర్లు

చెన్నూర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్న పంచాయతీ కార్యదర్శులు

కోటపల్లి, డిసెంబర్ 2 : మంచిర్యాల జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 5108 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులతో పాటు దివ్యాంగులు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. చెన్నూర్ నియోజకవర్గంలో 1457 మంది, బెల్లంపల్లి నియోజకవర్గంలో 1104 మంది, మంచిర్యాల నియోజకవర్గంలో 2547 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. కాగా నేడు జరగనున్న ఓట్ల లెక్కింపులో ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఉద్యోగులంతా వారి ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులతో పాటు దివ్యాంగులు, వృద్ధులు కూడా మేము సైతం అంటూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు..

ఓటు వేసి విధులకు హాజరయ్యా..



ఎన్నికల విధులు నాకు కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసి విధులకు హాజరయ్యాను. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం కాగా ప్రతి ఎన్నికలలో నేను తప్పకుండా నా ఓటు హక్కును వినియోగించుకుంటాను. పాఠశాలలోనూ విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి వారి తల్లిదండ్రులు ఓటు వేసేలా చైతన్య పరిచే కార్యక్రమాలను చేశారు.

-లావణ్య, ఉపాధ్యాయురాలు, కోటపల్లి

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు..

ఎన్నికల విధుల నేపథ్యంలో నేను పోస్టల్ బ్యాలెట్ ద్వారా నా ఓటు హక్కును వినియోగించుకున్నా. అసెంబ్లీ ఎన్నికలలో రెండవసారి ఓటు వేస్తుండగా, మొదటిసారి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నా. పంచాయతీ కార్యదర్శిగా నాకు ఎన్నికల విధులు కేటాయించగా, నా ఓటు వృథా కావద్దని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశాను.

-చెన్న శ్రీవిద్య, పంచాయతీ కార్యదర్శి, మల్లంపేట, కోటపల్లి

ఓటు హక్కును వినియోగించుకోవాలి..

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు నిర్ణయాత్మక శక్తి. ఓటు వేయకుండా బద్ధకిస్తుండడం వల్ల మనకే అన్యాయం జరిగే అవకాశం ఉంది. నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికల్లో తప్పనిసరిగా నా ఓటు హక్కును వినియోగించుకుంటున్నాను.

-నీలేశ్ కచ్‌వాల్, ఉపాధ్యాయులు, మంచిర్యాల

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

ఓట్లు లెక్కించేందుకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

హాజీపూర్, డిసెంబర్ 2 : గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్లను లెక్కించేందుకు జిల్లాలోని హాజీపూర్ మండలంలోని ముల్కల్ల గ్రామ పంచాయతీలో ఉన్న ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల నియోజకవర్గంలో ఓట్లను లెక్కించేందుకు 14 టేబుళ్లలో 21 రౌండ్లు, బెల్లంపల్లి నియోజకవర్గంలో ఓట్లను లెక్కించేందుకు 14 టేబుళ్లలో 17 రౌండ్లు, చెన్నూర్ నియోజకవర్గంలో ఓట్లను లెక్కించేందుకు 14 టేబుళ్లలో 17 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. దాదాపు 600 మంది అధికారు లెక్కింపులో పాల్గొంటారన్నారు.

తల్లీ కూతుళ్లు మృతి

నిర్మల (ఫైల్)

తాండూర్, డిసెంబర్ 2 : వ్యక్తిగత కారణాలతో గడ్డి మందు తాగి తల్లీకూతుళ్లు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాండూరు మండలం బోయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం .. బోయపల్లికి చెందిన గొడిసెల నిర్మల(40) భర్త గతంలోనే చనిపోయాడు. ఆమెకు కూతురు రచన ఉంది. కాగా శుక్రవారం రాత్రి వారిద్దరూ ఇంట్లో వ్యక్తిగత కారణాలతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. గమనించిన కుటుంబీకులు వారిద్దరిని చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి నిర్మల, కూతురు రచన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బోధన

విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

బెల్లంపల్లి, డిసెంబర్ 2: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో బోధన తరగతులు నిర్వహించారు. బెల్లంపల్లిలోని షంషీర్‌నగర్ ప్రాథమిక పాఠశాల, తాండూర్, మందమర్రి పాఠశాలల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బోధన చేశారు. పిల్లల కోసం అనే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ మేకల గోపాల్ తెలిపారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కాంపల్లి శంకర్, పాఠశాలల హెచ్ఎంలు, లెక్చరర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కన్నెపల్లి, డిసెంబర్ 2 : కన్నెపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే అన్నదానికి భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానానికి దాతలు సహకారాలు అందించాలని కోరారు.